# అత్తరు సాహెబ్

(కథానిక)

అటు పట్నానికీ యిటు పల్లెకీ సంబంధం లేకుండా మధ్యరకంగా ఉండే గ్రామానికి బావమరది ఆర్డరు వేయించుకొని వచ్చాడు. బ్రహ్మిగాడికి చస్తున్నా నన్నా మంచి నీళ్ళు పుట్టని యీ రోజుల్లో, కొత్తగా పెట్టిన సెకండరీ స్కూల్లోకి అసిస్టెంటుగా తనకు ఆర్డరు వేయించుకొచ్చినందుకు ముత్యాలరావు ఎంతో సంతోషించాడు. బావమరదికి మనసారా కృతజ్ఞతావందనా లర్పించాడు. కాని—

"ఎంతో ప్రయాసపడ్డాను. అంతకుముందే యీ పోస్టుకోసం గ్రద్దల్లాగ ఆరుమంది కాచుకు కూర్చున్నారు. నీమీదనుండే ప్రేమవల్ల నేనూ నామీదుండే ప్రేమమీద నా మిత్రులూ పట్టుబట్టి అంతు తేల్చుకుని ఆర్డరులాక్కొచ్చారు. ఏదో ఆర్డరు వచ్చిందిగదా, ఎప్పుడో జేరదారి అనుకొంటే లాభంలేదు. ఈ పోస్టు పెర్మనెంటుది. ఇదివరకు చేస్తున్నాయన హఠాత్తుగా మరణించటంవల్ల నీ కీవిధంగా లభించింది. రేపటెల్లుండి తప్పక బయలుదేరి వెళ్ళి జాయినవ్వాలి" బావమరిది యీవిధంగా అనటంతోటే ముత్యాలరావు పళ్లు మండిపోయింది. తన భార్యకు అన్నగారని దయతలచి ఊరుకొండిపోయాడుగాని లేకపోతే వీపు మర్దనాచేసి వుండేవాడు!

ఎంత బావమరది అయినా ఎంత తన మేలుకోరేవాడయినా మంచి చెడ్డలూ, ముందు వెనుకలూ యోచించకుండా తన విషయంలో ఈ విధంగా మాట్లాడొచ్చా? సరిగ్గా శుభకార్యంఅయి, నాలుగురోజులైనా నిండుగా పూర్తవలేదే? ఇటు గంధం వాసనలు, సెంటు ఘుమఘుమలు, అత్తర నూనెల మత్తు తననుంచి యింకా విడచిపోలేదే? నిద్రబద్ధకం సరిగ్గా ఇంకా తీరలేదే? శిల్పిగారలు యింకా పోలేదే? బట్టలపరిమళం యింకా హరించలేదే!

బావమీద ముత్యాలరావుకు చెప్పలేని కోపం కల్గింది. ఆ పట్టుకొచ్చే ఆర్డరు మరో నాల్గురోజులు పోయినతర్వాత తీసుకొని రాకూడదా అని అతని గోల. పోనీ ఆర్డరు తెచ్చినప్పటికీ నాలుగయిదు రోజులు పోయిన తర్వాత కొంచెం తేరుకొన్న తర్వాత వెళ్ళి జాయినవమని చెప్పకూడదూ? తన శ్రేయస్సుకోరే వ్యక్తిగా ఒక నాలుగురోజుల కాలం ఓపికతో ఊరుకుండగూడదూ? తన మంచి చెడ్డలు ఆమాత్రం తెలియవ్వూ?

పోనీ బావమరదిలో యేదోమూల తనమీద కోపందాగుండి వుండవచ్చు. ఏమయినా కోపం ఉంటే దాన్ని సాధించుకొనే విధానం ఇదా? తనమీద కోపంఉన్నా పై విషయం వల్ల బాధపడుతున్న వ్యక్తులు యిద్దరన్న సంగతి కొంచెం అతడు గ్రహించివుంటే యింత తెలివి తక్కువగా మాట్లాడి వుండడు.

ఏమయితేనేం ముత్యాలరావు బావమరది పట్టుదలవల్ల కాకపోయినా ఆర్డరులో విశేషం మూలకంగా, యెంత బద్ధకంగాఉన్నా, వెళ్ళి ఉద్యోగంలో జాయినవటం తప్పని సరైంది. బావమరదిని మనసులో దూషించుకొంటూ వదలేక వదలేక భార్యను విడచి, ఆ శుభకార్యపు బద్ధకంతోనే బయలుదేరాడు ముత్యాలరావు.

ముత్యాలరావును చూసి హెడ్మాస్టరు ముఖంలో ఆశ్చర్యం కనపర్చాడు. ఏమిటి 'ఇంత చిన్న వయస్సు గలవాడు అప్పుడే ఉపాధ్యాయుడయి పోయాడని. నిజంగా అతడ్ని హఠాత్తుగా చూస్తే అపారమేధస్సు అతనిలో దాగి ఉంటుందని అనుకోనివారుండరు. నవ్వుతూ ముత్యాలరావుతో చెప్పాడాయన "థర్డ్ ఫారం క్లాసుకెళ్ళండి. వాళ్లకు సైన్సు చెప్పాలి. పోయిన మేష్టారు అదే చెప్పేవారు" అని.

ముత్యాలరావు గుండె దడదడ కొట్టుకోసాగింది. తాను తన చదువుకొనే రోజుల్లో గురువుల యెడల యే విధంగా అదుపాజ్ఞల్లో

ఓగేటి శివరామకృష్ణ

మనసులు కొంటూండేవాడో యింకా జ్ఞాపకం ఉంది. ఈ రోజున తనకు తయారయే శిష్యులు మాత్రం ఆ విధంగా తయారవకుండా ఉంటారా? గురువుగారికి చదువు చెప్పకుండా ఉంటారా? ఈఆలోచనలన్నీ ముత్యాలరావులో దొర్లిపోయాయి. అయితే, "నే ఆ తరగతికి చెప్పలేను ఏదయినా చిన్నక్లాసు యిప్పించండి" అని అడగటం కేవలం తన శక్తి తక్కువని తెల్పుకోవటం కాదూ?

ముత్యాలరావు అడగలేదు కాని ఆ భావం అతని ముఖంలో గోచరించింది. అది కనిపెట్టిన హెడ్మాష్టరు "ఏం భయంలేదు. మా పిల్లలు ఉపాధ్యాయుల అడుగుజాడల్లో మసులు కొనే వారు. మీకే తెలుస్తుందిగా వెళ్ళండి. పాపం వాళ్ళకు ఇరవై రోజుల్నుంచి మేష్టరులేరు" అని అన్నాడు మరోపనిమీదకు ధ్యానమళ్లిస్తూ.

"అలాగాండి" అంటూ బయలుదేరాడు ముత్యాలరావు యోచన చేస్తూ. ఏం చెప్పాలో యేం చెయ్యాలో అతడి కాసమయంలో అర్థం గాకుండా ఉంది. కొత్తగా బళ్ళోకి వెళ్ళే కుర్రవాడివిధంగా ముత్యాలరావు స్కూలు వరండా గుండా నడుస్తూంటే, "అదండి బాబయ్యా తమ క్లాసు" అంటూ ప్యూను దారిచూపించాడు.

ముత్యాలరావుమీద పిడుగు బడ్డట్టయింది. ఎక్కడో ఏమో అని నడుస్తున్నాడు ముందుకు. కాని ఎట్టయెదుటే తన క్లాసున్నప్పుడు తపస్సు చేయకండా భగవంతుడు ప్రత్యక్షమైతే భక్తుడేవిధంగా ఆశ్చర్యం చూపుతాడో అదేవిధంగా చూపాడు. తన గట్టల సెంటు వాసన, తల నూనె పరిమళం మత్తు అతన్ని క్లాసులోనికి వెళ్ళనివ్వటంలేదు. అయితే తరగతిలోని కెళ్ళ వలసిన బాధ్యత ముత్యాలరావుకుంది. వెళ్ళటానికే ఆపసోపాలు పడుతున్న ముత్యాలరావునుచూచి, "అదేమిటి బాబయ్యా! బయటే నిల్చున్నారు. లోనికి వెళ్ళండి" అని యిందాకటి ప్యూను వచ్చి చెప్పి, తరగతిలోకి గూడ పోయి పిల్లలకి చెప్పి వచ్చాడు.

అంతవరకూ గొడవ చేస్తున్న తరగతి ఒక్కసారి నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఒకళ్ళిద్దరు పెద్దకుర్రాళ్లు క్లాసుబయటకొచ్చి "నమస్కారం మేష్టారూ లోనికి రండి" అని లోనికి తీసుకొని పోయారు. తన వయస్కులైన పిల్లలు తాను బోధచేయవలసిన క్లాసులో ఉండటం ముత్యాలరావుకు మరింత భయం కల్గించింది. అయితే యెదురుగా తన తెలివి తక్కువతనం ప్రదర్శించటం...

"ఓ హో! యిదేనా మీ క్లాసు? ఎవరిదో అని యింత సేపూ బయట నిల్చున్నాను" అంటూ లోనికి ప్రవేశించాడు ముత్యాలరావు తెలియనట్టు.

గౌరవ విధేయతల్తో తరగతంతా ఒక్కమారు నిల్చుంది. విద్యార్థులు ఈ విషయంలో తన కాలంనాటి విద్యార్థుల వంటివారు కానందుకు ముత్యాలరావు మనస్సులో ఎంతో సంతోషించాడు "కూర్చోండి" అన్నాడతను సగౌరవంగా కుర్చీ లో కూర్చుంటూ. కాని అతడు కూర్చుండీ కూర్చుండకండానే,

"పిచ్చాడ్రా" అని పొట్టి బుడంకాయ చప్పరించాడు. తరగతంతా ఒక్కమారు నవ్వింది. ముత్యాలరావుకుముచ్చెమట్లుపోశాయి. ఇంతలో ఏ వ్యక్తి అయితే తన్ను బయటనుంచి లోనికి సగౌరవంతో, వినయవిధేయతలు ఒలికేలా పిలిచి తీసుకొని వచ్చాడో, ఆ వ్యక్తే "గుమ్-గుమ్ అత్తరు సాహెబ్ రా. గొడవ చేయకండి" అన్నాడు.

ఇంతలోనే కాలం-కర్మం కలసివచ్చినట్లుగా ముత్యాలరావుకు హఠాత్తుగా తుమ్మువచ్చి పడ్డది. తుమ్మాడు, అతని తుమ్ము వెనక మరో నలభైరెండు తుమ్ములు ఒక్కమారుగా విరుచుకు పడ్డాయి. ముత్యాలరావు చాలా ఖంగారు పడ్డాడు. ఆడపిల్లలు గూడా పై విషయంలో సోదర విద్యార్థుల ననుసరించారు. ఏలాగో తమాయించుకొని 'సైలెన్సు' అన్నాడతను. అంతే యెక్కడికక్కడి, యెవరికివారు 'ఉస్సు' రనటం ప్రారంభించారు. ముత్యాలరావు ఉడికి పోయాడు. ముఖం అంతా చెమటతో తడిసి పోయింది "మేనర్సు ఏం తెలియవు .. కాస్త జాగ్రత్తగా మసలుకోండి"-అన్నాడతను గుండె చేత్తో పట్టుకొని" "చిత్తం" అన్నాడిదివరకు తనను తరగతిలోకి ఆహ్వానించినవిద్యార్థి. అతని మాటల్లో వెగటుతనం కన్పించుచుతూనే ఉంది.

"నోరు ముయ్యి. తెలివితేటలు చాలా అభి

వృద్ధి పొందుతున్నాయ్" అన్నాడు ముత్యాల రావు గట్టిగా.

"ఏం చేశానేమిటయ్యా, అలా విరుచుకు పడతావ్?" అన్నాడా విద్యార్థి.

నానాటికీ తీసికట్టు నాగంభట్టు విధంగా తనమీద గౌరవం అంతకంతకు నశించుతోందని ముత్యాలరావు గ్రహించ గలిగాడు. ఏదో విధంగా కప్పదాటు దాటి బయటకు వెళ్ళడానికి వీలులేదాయె. పీరియడు ప్రారంభమయి పదిహేను నిముషాల చిల్లర అయింది. మరి సుమారు అరగంట కాలం అయినా గడపక తప్పదు.

"మాస్టారూ, గొడవ యేలానూ ఉంటూనే ఉంటుంది. పాఠం చెప్పండి" అన్నాడు ఒక విద్యార్థి-పాఠాలు కోరే వ్యక్తి విధంగా పోజు పెట్టి! ముత్యాలరావుకు పాఠం చెబితే కొంత వరకు గొడవ తగ్గుతుందేమో అన్న ఆలోచన మనస్సులో కలిగింది. తన శక్తినంతా ప్రదర్శించి పాఠం చెప్పాలనీ, ఒక్కగా ఒక్క పాఠంతో పిల్లల పూర్తిఅభిమానం సంపాదించుకోవాలనీ అనుకున్నాడుముత్యాలరావు. అందుకనే, "పాఠం చెబుతా పుస్తకం ఒకటి తెచ్చియివ్వండి" అని అన్నాడు. అనటం తడవుగా "మంచిది మాస్టారూ. యిదిగో యీ పాఠం చెప్పాలి"అంటూ తెచ్చియిచ్చాడు పెద్ద మొద్ద బ్బాయ్ అంతకుముందు సంగతి మరచిపోయి.

ముత్యాలరావు పాఠంవంక చూసి, తెల్లబోయాడు "నిజం మాస్టారూ. ఈ అత్తరు పాఠమే చెప్పాలి"అంటూ నవ్వాడు. ముత్యాల రావుకు మనిషికివచ్చే కోపంవచ్చింది. తోడుగా పిల్లలంతా ఒక్కపెట్టున నవ్వారు.

ముత్యాలరావుకు దుఃఖం అలుము కొచ్చేసింది. తెచ్చి పెట్టుకొన్న తద్దినం క్రింద కన్పించిందతనికి. అయితే పాఠం చెప్పటమా మానటమా? పాఠం చెప్పినట్లయితే ఒక విధంగా బాధపడవలసి వస్తుంది, చెప్పనట్లయితే మరో విధంగా బాధపడవలసి వస్తుంది.

"చెప్పండి మేస్టారూ" అన్నాడు యిందాకటి వ్యక్తి. తెగించి ధైర్యం తెచ్చుకొన్నాడు ముత్యాలరావు. "సరే కూర్చో" అని అతని కేసి చూస్తూ పాఠం మనసులో ఒకమారు చదువుకొని చెప్పటానికి ఉపక్రమించాడు.

పిల్లలంతా యెంతో కుతూహలంతో వింటున్నారు. పెద్ద మొద్దబ్బాయ్ మధ్యమధ్య అడ్డదిడ్డం ప్రశ్నలెన్నో వేసి, ముత్యాలరావుకు యెదురు కల్గిస్తున్నాడు. తనకున్న అనుభవాన్ని పునస్కరించుకొని అతి విపులంగా, వివరంగా అనేక విషయాలు తెల్పాడు ముత్యాలరావు. ప్రథమ పాఠమయినా ముత్యాలరావు చక్కగా చెప్పాడని చెప్పకతప్పదు. కొంత మంది పిల్లలను ముత్యాలరావు పాఠం ఆకర్షించింది. మరికొంతమందిని వినోదంతో ఆకర్షించింది. అత్తరుల్లో వివిధరకాలు, సువాసనలు, రంగు వగైరా విషయాలెన్నో చెప్పాడు ముత్యాలరావు. కొంతమంది కొంటెవాండ్రు అప్పటికప్పుడే ప్రశ్నలు వేశారు ముత్యాల రావును "ఏమండీ మాస్టారూ మీరింతయిదిగా పాఠం చెప్పారు గదా. అత్తరులు మీరు తయారుచేయగలరా" అని.

ముత్యాలరావు ముఖం కందగడ్డలా తయారయింది! "ఆ ..ఏం"అన్నాడతను కోపంతో.

"ఆ...ఏం లేదండి. కొంచెం మాకు తయారుచేసి పెడతారేమోనని"—అన్నాడు ఇది వరకు ముత్యాలరావును తరగతిలోనికి ఆహ్వానించిన వ్యక్తి!

"ఆ విషయాలు ప్రస్తుతం అప్రస్తుతం-అనక కనపడు"— అంటూ కోపం చూపించాడు ముఖంలో ముత్యాలరావు.

"చిత్తం" అన్నాడు వెగటుగా ఆ విద్యార్థి.

ఇంకా కాలముండేపక్షంలో మరో కొన్ని యక్షప్రశ్నలు వేసి ముత్యాలరావుకు విసుగు తెప్పించి వుండేవారు. కాని దైవానుగ్రహం వల్ల అంతటితో పీరీడు బెల్లు అయిపోయింది! ముత్యాలరావు క్లాసు బయటకు వచ్చేశాడు. అంతే. 'అత్తరు సాహెబ్' అన్న మాట మాత్రం తరగతి నుంచి ఒక్కసారి బయటకు వచ్చిపడ్డది.

* * *

రెండురోజుల్లో స్కూలంతటికీ ముత్యాల రావు పేరుకు బదులుగా 'అత్తరు సాహెబ్' అన్న నామం ప్రచారంలోనికి వచ్చేసింది.

ఉపాధ్యాయుల్లో కొంతమంది ముత్యాలు గారూ అని పిలుస్తూంటే, మరికొంతమంది ముత్యాలరావుగారూ అని నోరారా పిలుస్తూంటే వేరుకొంతమంది మాత్రం 'అత్తరు సాహెబ్ గారూ' అని నాలుక చివరిదాకా అని ఎట్టయెదుట కన్పడిన మనిషిని చూసి వేలు కొరుక్కునేవారు. పిల్లలకు పిల్లలు 'అడుగో అత్తరు సాహెబ్ గారు వస్తున్నాడు' అని అంటూండేవారు!

ముత్యాలరావుకు యీ విధంగా తన్ను పిలవటం ప్రారంభంలో చాలా బాధ కల్గించింది. అయితే తాను చదువుకొనే రోజుల్లో తన గురువులకు తాను పెట్టిన పేర్లూ జ్ఞాపకం ఉన్నాయ్ జాస్మిన్ అనీ, ముక్కుపొడుం అనీ, యువర్ సెల్ఫ్ అనీ యీలాంటివెన్నో తన గురువులకు తాను పెట్టాడు! ఇప్పుడు తన దగ్గర చదువుకొనే శిష్యులు మాత్రం తనవిధంగా తయారవకుండా ఉంటారా?

ముత్యాలరావు కొంచెం దూరం యోచించాడు. తనకు పెట్టిన ఉపనామం చక్కనిది. 'అత్తరు సాహెబ్'. అంతేకాని, కొంగ మెడ అనీ, తాటిచెట్టనీ, బోండాం అనీ సెల్ఫిష్ అనీ యీలాంటివేవీ పెట్టలేదు. తనకు అత్తరు సాహెబ్ అన్న నామం తనకు అత్తర్లు మీద, సెంట్లు మీదా ఉండే అభిరుచిని తెలియ పరుస్తుంది అంతేగా!

మొగలుల కాలంలోనూ, విజయనగర రాజుల కాలంలోనూ అభివృద్ధిపొందిన అత్తరు పరిశ్రమ తనద్వారా జీర్ణించిపోయిన దాని పేరు తిరిగి సంపాదించుకొంటోంది. తనకు పెద్ద బిరుదులేవీ లేవు. ఎందువల్లనంటే, పెద్ద దేశాన్ని పరిపాలించిన రాజులు గనక పూర్వపు రాజులు ఆంధ్ర భోజుడు వగైరా బిరుదాలను పొందటం సమంజసం. ఒక సెకండరీస్కూల్లో అసిస్టెంటుగా పనిచేస్తున్న తనకు అత్తరు సాహెబ్‌లాంటి బిరుదు చాలు!

ఈ విధంగా ముత్యాలరావు చాలాదూరం యోచించాడు. అంతవరకూ నృత్యం చేస్తున్న కోపం అతనినుండి పారిపోయింది ఒకవిధమైన ఆనందం అతని ముఖంలో తాండవించింది. అప్పటినుంచీ ఎవరయినా 'అత్తరుసాహెబ్' అంటే తలపైకెత్తి వారి కేసిచూసి నవ్వేవాడు ఏదోవిధంగా పల్కరించి, చమత్కృతితో వాళ్ళను నవ్విస్తూండేవాడు. ఈవిధంగా ఇతడు ప్లేటుఫిరాయించడం ఉపాధ్యాయులకూ విద్యార్థులకూ చాలా ఆశ్చర్యం కలిగించింది. ఎందువల్లనంటే విద్యార్థులంతా అంతవరకూ యేదో వంకతో తమ్ము ముత్యాలరావు శిక్షించుతాడనీ, తనకసి తీర్చుకుంటాడనీ భావించేవాళ్లు. ఉపాధ్యాయులకు ఎవరికితగ్గ నామాలు వాళ్ళకుంటూనే వుంటాయిగా! తమ్మావిధంగా పిలిచినప్పుడు ముఖం ముడుచుకుంటూ కోరగా వాళ్ళకేసి చూడటం అలవాటు.

అలాంటప్పుడు ముత్యాలరావు తనకు నామం లభించినందుకు విచారించక ఆనందాన్ని ముఖంలో వ్యక్తపరుస్తున్నాడంటే వాళ్ళంతా తెల్లబోవటంకంటె మరి చేసేదేముంది?

రోజులుగడుస్తున్న కొద్దీ ముత్యాలరావు మీద విద్యార్థులకు ప్రేమవాత్సల్యాలు పెరగసాగాయి. 'అత్తరుసాహెబ్' నామం అదే విధంగా అభివృద్ధి పొందుకొంది. అయితే ముత్యాలరావుకు ఒక అనుమానం, బాధ మనస్సులో ప్రవేశించాయి. కమల కాపురానికొచ్చింది. బళ్లో తన ఉపనామం నలుగురు నోళ్ళ పలకబడుతున్నా తాను బాధపొందడు. కాని, తన అర్ధభాగం సహితం, తన జీవితాంతం వరకూ, తన సహధర్మచారిణిగా మసలుకొనే ఆమెకి కూడా యీ ఉపనామం సంగతి తెలిసినట్లయితే తన కాపేరు పెట్టడం మానదు, ఏడ్పించటం మానదు.

బళ్లో ఆరుఏడు వందలమంది విద్యార్థులు తన్ను 'అత్తరుసాహెబ్' అని పిలుస్తే నవ్వుతూ ఊరుకోగలడు. కాని తాను ఆదికారం చెలాయించడానికి వీలుండే ఆమె తన్నంటే ఊరుకోగలడా? క్రొత్తకాపురం అని అయినా యోచింపకుండా నాలుగు చీవాట్లు వేస్తాడు. ఆమె బావురుమని యేడవటం సహజం. ఎందువల్లనంటే ఆడవాళ్ళకు యేడుపు పుట్టుకతో యేర్పడిందేగా! అంతటితో ఊరుకుండక పోవచ్చు. తనవాళ్ళకుకూడా విషయంవిశదంగా తెలియపరచవచ్చు. ఆమె నోట్లోనే కాకుండా తనచుట్టాలందరి నోట్లోనూ కూడా 'అత్తరు

సాహెబ్'గా తాను చలామణీ అవచ్చు. అసలు యింత గొడవ రావటం యెందుకూ? తానే ఆ విషయంలో జాగ్రత్తపడితే మరే గొడవా జరుగదనుకొన్నాడు ముత్యాలరావు.

*    *    *

కమల కాపురానికొచ్చి సుమారు నెలరోజులు జరిగిపోయాయి. మాట బయట పడకుండా ఉంటున్నందుకు చాలా సంతోషించాడు ముత్యాలరావు. అయితే కమలకు హఠాత్తుగా తెలిసే పరిస్థితి యేర్పడింది.

ఒక సెలవుదినం రోజున ముత్యాలరావు లేని సమయంలో ఒక మేష్టరువచ్చి "అత్తరుసాహెబ్ గారింట్లో ఉన్నారా?" అని ప్రశ్నించాడు. కమల "లేరు" అని జవాబిచ్చి "ఎవరూ?" అని తిరిగి ప్రశ్నించింది. "ఇది మేష్టారి ఇల్లు కాదూ?" అవతల వ్యక్తి ప్రశ్నించాడు. "అవును, లేరే" అంది కమల. అవతల వ్యక్తి వెళ్ళిపోయాడు. కమల ఆలోచనలో పడిపోయింది.

కొంచెం సేపటికి ముత్యాలరావు వచ్చాడు. తనకోసం ఎవరయినావచ్చారా అని ప్రశ్నించాడతను. "ఎవరో అత్తరు సాహెబ్ గారట, వారికోసం వచ్చారు" అంది కమల.

ముత్యాలరావు ప్రైప్రాణాలుపైనేపోయాయి. విషయం యెక్కడ తెలిసిందో అని అతడు భయపడిపోయాడు. కాని కమల "అత్తరు సాహెబ్ ఎవరండీ?" అని ప్రశ్నించటంతోటే విషయం తెలియదు గదా అని గుండెమీద చెయ్యి వేసుకొన్నాడతను.

"అత్తరు సాహెబా! ఒక మేష్టరులే. ఇక్కడకు వచ్చాడేమోనని వచ్చి ఉంటారు!" అని అన్నాడు ముత్యాలరావు. అప్పటికా విషయం అంతటితో ముగిసిపోయింది. విషయం బయట పడనందుకు ముత్యాలరావు యెంతో సంతోషించాడు.

కాని మరోమాటు కమలకు విషయం చూచాయగా తెలిసిపోయింది. ముత్యాలరావు వద్ద చదువుకొంటున్న ఒక పొరిగింటి అమ్మాయి పెద్ద మనిషి అయింది. ఇరుగూ పొరుగూ అవటంవల్ల ఆ దినానికి భోజనానికి రావలసిందని పిలవ వచ్చారువాళ్ళు కమలతో చెప్పి వెళ్ళుతూ పిల్లతల్లి చదువువల్ల నవ్వుతూ అంది "మా అత్తరు సాహెబ్ అన్నగార్ని గూడా తప్పక రమ్మని చెప్పండి" అని. కమల తెల్లబోయింది. చనువుగల మనిషి అవటంవల్ల ఆమెను లోనికి పిలిచి, విషయం అడిగింది. 'ఏ ముందమ్మా! మీ వారే అత్తరు సాహెబ్‌గారు" అంటూ నవ్వుతూ విషయం తేల్చి చెప్పింది. కమలకు ముందు కోపం, తర్వాత విచారం, తర్వాత సంతోషం ఒకదాని తర్వాత ఒకటి రాగల్గాయి.

ముత్యాలరావు వచ్చిన తర్వాత "ఎవరో అత్తరు సాహెబ్ గారట. ఆయన్ని భోజనానికి రమ్మన్నారు. మన పక్కింటి వాళ్ళు" అని నవ్వింది.

తెల్లబోయాడు ముత్యాలరావు! బహుశతు లేమయినా తగులుతాయేమోనని అప్పటికి ఊరుకొని పోయింది. కాని వేరొక సమయంలో ముత్యాలరావు భార్యా సమేతంగా యింట్లో ఉన్న సమయంలో ఒక విద్యార్థి రావటం, "అత్తరు సాహెబ్‌గారూ" అని తన్ను కేక వేయటం "ఓయ్" అని, అలా అన్నందుకు నాలుక కరచుకొని, కమల వేపు చూస్తూ బయటకు వెళ్ళటం, అవతల వ్యక్తితో మాట్లాడటం, అవతలవ్యక్తి "వెళ్ళొస్తా నమస్కారం. అత్తరు సాహెబ్‌గారూ" అంటూ నిష్క్రమించటం జరిగింది.

మరేంకావాలి! "అత్తరు సాహెబ్‌గారు తమరేనన్నమాట" అంటూ నవ్వింది కమల! "అంతా మీ అన్నయ్య చేసిన పనే" అన్నాడు ముత్యాలరావు కోపంతో. ఏమయితే నేం— యిప్పుడు ముత్యాలరావు "అత్తరు సాహెబు" క్రింద ఉపాధ్యాయుల్లోనూ, విద్యార్థుల్లోనే కాకుండా, తన భార్యా రత్నంతోసహా బంధువుల మధ్య, చలామణీ అవుతున్నాడు.

---

దెబ్బలాట తప్పని సరి అయితే అందులో మేధాశక్తి ఉపయోగించడం మంచిది. కాని చిక్కల్లా అక్కడే వస్తుంది: ఆ లెక్క ప్రకారం నీ కన్నా చిన్నవాడు దొరకడు.